క్లుప్తంగా

దుర్గమ్మకు నృత్యనీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు చిన్నారులు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయానికి చెందిన 25 మంది కళాకారులు తమ నాట్యప్రదర్శన ద్వారా అమ్మవారికి నీరాజనాలను అర్పించారు. నృత్యాచార సప్ప శివకుమార్ పర్యవేక్షణలో చిన్నారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ప్రదర్శించిన నృత్యాన్ని భక్తులు ఆద్యంతం ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాకారులను ఆలయ అధికారులు అభినందించి అమ్మవారి దర్శనం కల్పించారు.

వీఎంసీ డైరీ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ రూపొందించిన డైరీని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం అధికారులతో కలసి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ అందించే సేవలన్నింటినీ సమగ్రంగా ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు డైరీని రూపొందించడం అభినందనీయమన్నారు. నగరవాసులకు ఉపయోగపడేలా ముఖ్యమైన సమాచారాన్ని డైరీలో పొందుపరిచారని తెలిపారు. తద్వారా ప్రజలకు మున్సిపల్ సర్వీసుల గురించి పూర్తి సమాచారం లభిస్తుందన్నారు. నగర పరిశుభ్రత, మౌలిక వసతులు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన పెంపొందించేందుకు డైరీ దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ బీ సత్యనారాయణమూర్తి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పీ వెంకటనారాయణ, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె సురేష్‌బాబు, ఎగ్జామినేటర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అసిస్టెంట్ కమిషనర్లు వెంకటేశ్వరరావు, హెలెన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానసిక వికాసంతో పరిపూర్ణ ఆరోగ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మానసికంగా పరిపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకురాలు వి.శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేబీఎన్ కళాశాల యుజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త నిర్వహణలో కళాశాల దత్తత గ్రామం కొత్తూరు తాడేపల్లి హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం 'సైకలాజికల్ వెల్ బీయింగ్' అనే అంశంపై అవగాహన కల్పించారు. శ్రీదేవి మాట్లాడుతూ పరిశుభ్రత జీవన విధానం కావాలన్నారు. ఎన్ఎస్ఎస్. కోఆర్డినేటర్ ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పౌరులు దేశప్రగతికి కీలకమని వివరించారు. ఉమెన్ స్టడీస్ సెంటర్ సభ్యురాలు కే మౌనిక, ఆయుష్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫేర్‌వెల్ డే వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం అరవింద వీధిలోని బెజవాడ రాజారావు హైస్కూల్ ఫేర్‌వెల్ డే వేడుకలను శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా హైస్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నట్లు వివరించారు. స్థానిక కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఫేర్‌వెల్ డే ఒక మధురానుభూతిని కలిగిస్తుందని పేర్కొన్నారు.సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పాఠశాల సెక్రటరీ శ్యామ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఎన్‌సీసీ ప్రారంభించామని, స్టడీ మెటీరియల్ లేకుండా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని వివరించారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ కెవెల్ ప్రసన్న, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్ బీయూ) పిలుపు మేరకు ఈనెల 24, 25 తేదీల్లో సమ్మె చేపట్టనున్నట్లు బీఈఎఫ్ఐ నేత ఆర్.అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ఎస్‌బీఐలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యతోనే మహిళా వికాసం

- విద్యారంగంలో దూసుకుపోతున్న మహిళలు
- నగరంలో పలు ప్రధాన కళాశాలల ప్రిన్సిపాల్స్‌గా మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆడపిల్ల బయటకు వెళ్లి చదువుకునేందుకు ఇష్టపడని నాటి సమాజం ఇప్పుడిప్పుడే అందుకు భిన్నంగా అడుగులు వేస్తోంది. అనేక మంది సంఘసంస్కర్తలు, మహిళా ఉద్యమ నేతలు చేసిన పోరాటాల ఫలితంగా మహిళలు చదువుకునేందుకు అనేక అవంతరాలను దాటి పాఠశాలలకు అడుగులు వేస్తున్నారు. ఆడపిల్లలను చదివించాలనే తలంపును నేటి కుటుంబాలు పెంచుకుంటున్నాయి. విద్యారంగంలో మహిళలు పురుషులతో పాటుగా సమానంగా జిల్లాలో ముందుకు అడుగులు వేస్తున్నారు. మహిళా కళాశాలలు అనేకం విజయవాడలో విద్యను అందిస్తుండగా కో–ఎడ్యుకేషన్ కళాశాల్లోనూ విద్యార్థినుల శాతం అధికంగానే ఉంటోంది. కొన్ని విద్యాసంస్థల్లో బాలురు కన్నా అధికంగానే బాలికలు కనిపిస్తున్నారు.

విద్యతోనే వికాసం

విద్యతోనే మహిళా వికాసం సాధ్యమని పలువురు మహిళా విద్యావేత్తలు చెబుతున్నారు. మహిళలు ఏ రంగంలో రాణించాలన్నా విద్యావంతులైనప్పుడు అది మరింత సులభంగా సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. నగరంలోని పలు విద్యాసంస్థలకు ప్రిన్సిపాల్స్‌గా మహిళలు రాణిస్తున్నారు. విద్యలవాడకు గణతికెక్కిన విజయవాడలో ప్రధాన కళాశాలలకు మహిళలే అధిపతులుగా ఆయా విద్యాసంస్థలను ముందుకు తీసుకెళ్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా విద్య అవశ్యకతపై వారి అభిప్రాయాలు.

సోషల్ మీడియాకు ప్రభావితం కాకూడదు



చాలా కుటుంబాలు ఆడపిల్లలను చదివిస్తున్నాయి. అయితే సోషల్ మీడియా ప్రభావంతో అకడక్కడ ఒకరిద్దరు తప్పటడుగులు వేసేసరికి వాటి ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలు తమ పిల్లలను ఇంటర్ వరకూ చాలులే అనే భావనకు వచ్చేస్తున్నారు. పేద కుటుంబాలు సైతం తమ ఆడపిల్లలు చదివించాలని ముందుకు వస్తున్నారు. ఆడపిల్లలు వారికి ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోకుండా అడుగులు వేయాలి. కనీసం పీజీ చేసి, తమ జీవితంపై అవగాహన కలిగినప్పుడే ఇతర విషయాలను ఆలోచించాలి.

– డాక్టర్ ఎస్ కల్పన, ప్రిన్సిపాల్, శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల

విద్యార్థినుల సంఖ్య పెరిగింది



విద్యాలయాల్లో ఇటీవల విద్యార్థినుల సంఖ్య పెరిగింది. ఇంకా పెరగాలి. అలాగే అది కేవలం హైస్కూల్, జూనియర్ కళాశాలకే పరిమితం కాకుండా విశ్వవిద్యాలయాల్లోనూ ఆ సంఖ్య భారీగా పెరగాలి. అప్పుడే మహిళలకు మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలు కలుగుతుంది. మహిళలు అన్ని రంగాల్లోనూ విజయవంతంగా దూసుకుపోతున్నారు. అయితే ఇంకా సాధించాల్సింది చాలా ఉంది. ఇంకా మహిళల పట్ల చాలా రంగాల్లో వివక్షత వెంటాడుతుంది. వెనుకబాటును ఎదుర్కొంటున్నారు. వాటిని దాటి ముందుకు సాగాలంటే మహిళలు ఉన్నత విద్యావంతులైనప్పుడే అది సాధ్యం.

– ఎం.రమణశ్రీ, ప్రిన్సిపాల్, గాంధీజీ మహిళా కళాశాల

మహిళలు సాధించాల్సింది చాలా ఉంది



మహిళలు ఇంకా సాధించాల్సింది చాలా ఉంది. సమాజంలోని చాలా రంగాల్లో మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతుంది. వివక్షత దూరం కావాలంటే మహిళలు విద్యావంతులైనప్పుడే అది సాధ్యమవుతుంది. అలాగే మహిళలు ఏ రంగంలోనైనా రాణించేందుకు సమాజంలో చాలా అవకాశాలు ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకోవాలంటే ఆమె విద్యావంతురాలైనప్పుడే సాధ్యమవుతుంది. సమాజంలో మహిళలు సగంగా ఉన్నా ఇంకా చాలా రంగాల్లో వెనుకబాటు ఉంది. పురుషులతో పాటుగా మహిళలు రాణించేందుకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు అడుగులు వేయాలి.

– డాక్టర్ జీ కృష్ణవేణి, ప్రిన్సిపాల్, కేబీఎన్ కళాశాల

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు వశం చేసే బడ్జెట్

రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు కేశవరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేసే దిశగా 2025–26 బడ్జెట్ ఉందని రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు అన్నారు. ఈ బడ్జెట్‌ను రివైజ్ చేసి వ్యవసాయ, సాగునీటి రంగాలను కాపాడుకోకపోతే రాష్ట్ర దివాళా తీస్తుందన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఎం.బి.విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యుడు ఎస్.వి.రామరాజు అధ్యక్షతన ఏపీ అభివృద్ధి 2025–26 బడ్జెట్ పరిశీలన అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేశవరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను పూర్తిగా విస్మరించారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆయా రంగాలకు సక్రమంగా కేటాయింపులు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కరవు ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు తెలుగుగంగ, హంద్రీ–నీవా, గాలేరు, వెలుగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి వాటిని పూర్తి చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలవుతున్నారని, ధరల స్థిరీకరణకు కనీసంగా రూ.4వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేవన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ కార్పొరేటీకరణను ముందుకు తీసుకెళ్తూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్ అని విమర్శించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆరు గ్యారెంటీల్లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న, నాయకులు ఎస్.అనిల్, సుజాత, గుండు నారాయణ, యువి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థినులు సృజనాత్మకశక్తిని పెంపొందించుకోవాలని అప్పుడే తమ రంగాల్లో చక్కని విజయాలను సాధిస్తారని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల సీఎస్ఈ, ఈసీఈ విభాగాల ఆధ్వర్యంలో ఐసీటీ అకాడమీ, హనీవెల్, యూఐపాత్ సంస్థల సౌజన్యంతో మహిళా సాధికారత కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థినులకు రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. రెండు వారాల పాటు జరిగిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థినులు సృజనాత్మకతకు పదును పెట్టి మరిన్ని నూతన ఆవిష్కరణలను తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్, విభాగాధిపతులు డాక్టర్ ఎస్వీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపులకు అవకాశం



డ్రెయినేజ్ కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): పన్నుల బకాయిల చెల్లింపులకు సెలవు దినాల్లో కూడా క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ)జి.సృజన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో ఎక్కువ మొత్తంలో పన్ను బకాయిలు ఉన్న పలువురి నివాసాల కుళాయి, డ్రెయినేజీ కనెక్షన్లను రెవెన్యూ శాఖ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వన్‌టౌన్, కొత్తపేట, రైల్వే స్టేషన్, గవర్నర్‌పేట, వాంబే కాలనీ, గాంధీనగర్, పటమట, కరెన్సీనగర్ తదితర ప్రాంతాల్లో పన్ను బకాయిలు అధికంగా ఉన్నందున కనెక్షన్లను తొలగించామని తెలిపారు. ప్రజలంతా సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం ఈనెల 31వతేదీ వరకు సెలవు రోజుల్లో కూడా నగరపాలక సంస్థకు చెందిన అన్ని క్యాష్ కౌంటర్లు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని వివరించారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఖాళీ స్థలం, ఇంటి డ్రెయినేజీ, నీటి పన్నులను 31వ తేదీ నాటికి చెల్లించి రెండు శాతం అదనపు వడ్డీ పడకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆదిదంపతుల ఆర్జిత సేవలకు డిమాండ్



శ్రీచక్రనవార్చన జరిపిస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు శుక్రవారం నిర్వహించిన ఆర్జిత సేవలలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాల, ఉదయం ఆలయ ప్రాంగణంలో రాజగోపురం వద్ద నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణంలో ఉభయదాతలు పాల్గొన్నారు. సుముహూర్తం వేళ ఒక్కటైన నూతన వధూవరులు పెళ్లి దుస్తులలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకునేందుకు విచ్చేసిన నవ వధూవరులు, వారి కుటుంబ సభ్యులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. పెరుగుతున్న ఎండలు, మరో వైపున ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో భక్తుల రద్దీ సాధారణంగానే కొనసాగింది. సర్వ దర్శనం క్యూలో అర్ధగంటలోపే అమ్మవారి దర్శనం పూర్తయింది. ఇక రూ. 100, రూ.300, రూ. 500 టికెటు క్యూలో త్వరితగతిన దర్శనం కలిగింది. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు, ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

మాంసపు వ్యర్థాలను చేపలకు వేయకూడదు

వీఎంసీ ఇన్‌చార్జ్ సీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పరిధిలోగల మాంసపు దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను చేపలకు వేయకూడదని మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్‌బాబు అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయన శుక్రవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని సమావేశ మందిరంలో చికెన్, మటన్, బీఫ్, ఫిష్ షాపుల యజమానులతో వ్యర్థాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంసపు షాపుల నుంచి వచ్చే వ్యర్థాలను ప్రైవేట్ వ్యక్తులు కొందరు సేకరించి వాటిని చేపల చెరువులకు వినియోగిస్తున్నారన్నారు. మాంసపు దుకాణాల నుంచి సేకరించిన వ్యర్థాలను సరైన రీతిలో డిస్పోజ్ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా వ్యర్థాలను సేకరించడమే కాకుండా వాటిని కంపోస్టింగ్ తదితర పద్ధతులను వినియోగించి వ్యర్థాల నుంచి సంపద తయారు చేసేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు. మాంసపు దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధమని డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబూ శ్రీనివాస్, డాక్టర్ గోపీ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రేమించాలంటూ బాలికకు వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఓ బాలికను వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు జక్కంపూడి కాలనీలోని బ్లాక్ నంబరు 82లో నకిరికంటి శివకుమార్ కుటుంబం నివాసం ఉంటోంది. శివకుమార్ కుమార్తె పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటుంది. బాలికను కాలనీకి చెందిన నక్కా రవి అనే యువకుడు కొంత కాలంగా ప్రేమిస్తున్నానని వేధించసాగాడు. ఈ నెల 4వ తేదీన రవి బాలిక ఇంటికి వెళ్లి ప్రేమించాలని, పెళ్లికి ఒప్పుకోవాలని బెదిరిస్తూ బ్లేడ్‌తో చేయి కోసుకుని భయాందోళనలకు గురి చేశాడు. కొంత సమయం తర్వాత బాలిక తల్లిదండ్రులు ఇంటికి రావడం విషయం చెప్పింది. ఘటనపై బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

సాక్షి స్పందన



చల్లపల్లివారివీధిలో స్కూల్ వద్ద అనధికార నిర్మాణాలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని అక్రమ నిర్మాణాలపై ఈనెల 5వతేదీన 'సాక్షి'దిన పత్రిక ప్రచురించిన 'బహుల అంతస్తు.. అక్రమాలు మస్తు' అనే కథనానికి నగరపాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. అధికారులు ఆ ప్రాంతంలో పర్యటించి అక్రమణ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. చల్లపల్లివారివీధిలోని ఓప్రైవేట్ స్కూల్ ఎదురుగా అనధికారికంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని అడ్డుకుని శ్లాబును పగులకొట్టారు. మరో ఫ్లోర్ వేసేందుకు సిద్ధంగా ఉన్న సెంట్రింగ్‌లను కూడా తొలగించారు. గిరివీధి, తిరుమలరాజువీధులలో నిర్మాణంలో ఉన్న భవనాలకు అనుమతులు ఉన్నప్పటికీ కొంత మేరకు డివియేషన్లు ఉన్నట్లు గుర్తించామని, ఈ మేరకు ఆయా భవనాల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



కార్మికురాలిని సత్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి



బహుమతులు అందజేస్తున్న డీటీసీ మోహన్



ఉద్యోగికి చీరను బహూకరిస్తున్న ఏడీసీపీ సరిత



మహిళా ఉద్యోగులను సత్కరించిన డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఏసుదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళలు అన్నిరంగాలలో ముందుంటూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోగల అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. మినిస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా పలువురు మహిళా కార్మికులను సత్కరించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, ఈఈ సామ్రాజ్యం, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ రజియ షబీన, అసోసియేషన్ ప్రెసిడెంట్ రాంబాబు, సెక్రటరీ చలం పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న మహిళలు

విజయవాడస్పోర్ట్స్: ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ మహిళలు ముందంజలో కొనసాగుతున్నారని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కార్యాలయ పరిపాలన విభాగంలోని మహిళా ఉద్యోగులను డీసీపీ సరిత శుక్రవారం ఘనంగా సత్కరించి ఒక్కొక్కరికి ఒక్కో చీరను బహూకరించారు. కార్యాలయ పరిపాలన అధికారి సునీత, పరిపాలనా విభాగ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్, సంఘ సభ్యులు జి.శేషారత్నం, జి.కల్యాణి, ఎ.వి.ఎన్.ఎస్. కల్యాణి, ఆనంద్, నగేష్, పెరుమాళ్, బుచ్చయ్య, ఫ్రాన్సిస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రైల్వే ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకల్లో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ రైల్వేలో మహిళా సాధికారతలో ముందంజలో ఉందన్నారు. ఏడుగురు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, 17 మంది రైల్వే మహిళా ఉద్యోగులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వేడుకల్లో పాల్గొన్న మహిళలకు లక్కీడిప్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, పీ.ఈ. ఎడ్విన్, సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం కృషి

బస్టాండ్(విజయవాడపశ్చిమ): సమాజంలో లింగ సమానత్వంతో మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. ఏసుదానం పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన మహిళా ఉద్యోగులను సత్కరించి నగదు పురస్కారాలు అందజేశారు. డెప్యూటీ సీ.టీ.ఎం శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా పర్సనల్ ఆఫీసర్ వెంకటరమణ, డెప్యూటీ సూపరింటెండెంట్ హనుమంతరావు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం బాధ్యత

విజయవాడస్పోర్ట్స్: నిత్యం ఒత్తిళ్లతో సతమతమవుతున్న మహిళలు క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందుతారని, ఎన్టీఆర్ జిల్లా ఉప రవాణా అధికారి(డీటీసీ) ఎ.మోహన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని రవాణా శాఖ కార్యాలయంలో మహిళలకు క్రీడా పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ నర్సింగ్ మహిళ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీదేవి జడ్జిగా వ్యవహరించారు. రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, ఆర్టీఓ ఆర్.ప్రవీణ్, వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు సత్యనారాయణ, అబ్దుల్ సత్తార్, చంద్రకళ, జి.ఉష సుందరి పాల్గొన్నారు.

వీఎంసీ వర్సెస్ ఎన్‌హెచ్‌ఏఐ

డ్రెయిన్ నిర్మాణ పనులను అడ్డుకున్న ఎన్‌హెచ్‌ఏఐ



కొనసాగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులు



పనులను అడ్డుకునేందుకు వ్యాన్‌లో వచ్చిన సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక స్వాతి సెంటర్‌లో జాతీయ రహదారి పక్కన డ్రెయిన్ నిర్మాణ పనులను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సిబ్బంది అడ్డుకున్నారు. భవానీపురం దర్గా ప్రాంతంలోని డ్రెయిన్‌లో మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో డ్రెయిన్‌లోని మురుగునీరు సజావుగా ప్రవహించేందుకు స్వాతీ సెంటర్ నుంచి దర్గా వరకు ఉన్న కచ్చా డ్రెయిన్ స్థానంలో సీసీ డ్రెయిన్ నిర్మించే పనులను నగరపాలక సంస్థ ఒక ఏజెన్సీకి అప్పగించింది. బుధవారం నుంచి పనులు జరుగుతున్న క్రమంలో శుక్రవారం ఎన్‌హెచ్‌ఏఐ సంస్థకు చెందిన సర్వేయర్ శ్యామ్, సెక్యూరిటీ మేనేజర్, సిబ్బంది వచ్చి డ్రెయిన్ నిర్మాణానికి అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన వర్క్ ఆర్డర్ ప్రకారం చేస్తున్నామని ఏజెన్సీ బాధ్యులు వారికి సమాధానమిచ్చారు. అదేమీ కుదరదు ఎన్‌హెచ్‌ఏఐ నుంచి అనుమతి తీసుకోవల్సిందేనని, పనులు నిలిపి వేయమని చెబుతూ అక్కడ పని చేసేవారిని భయభ్రాంతులకు గురి చేసి వెళ్లిపొమ్మని హుకుం జారీ చేశారు. తాము గతంలోకూడా జాతీయ రహదారి పక్కన డ్రెయిన్ నిర్మాణ పనులు చేశామని, అప్పుడు ఈ విధంగా ఎవరూ అడగలేదని ఏజెన్సీ బాధ్యులు తెలిపారు. ఏదైనా ఉంటే నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడాలని సూచించారు. రంజాన్ మాసంలో దర్గా ప్రాంతంలో ఉంటున్నవారు డ్రెయిన్‌లో నిలిచిపోయిన మురుగునీటితో ఇబ్బందులు పడకుండా పక్కా డ్రెయిన్ నిర్మాణం చేస్తుండగా ఈ విధంగా అడ్డుకుంటే ఎలా పనులు చేయగలమని ప్రశ్నిస్తున్నారు. కాగా రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో జరుగుతున్న పనులను నిలిపివేయడం వలన తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

లోన్ క్లియరెన్స్ అందజేసి నష్టపరిహారం చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి సర్టిఫైడ్ కాపీలతోపాటు ఆస్తిపై ఎటువంటి బాకీ లేదని, నష్టపరిహారం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయలు శుక్రవారం తీర్పు చెప్పారు. విజయవాడకు చెందిన ఆర్‌వీ సత్యనారాయణమూర్తి అప్పటి ఆంధ్రాబ్యాంకు విజయవాడ మెయిన్ బ్రాంచ్‌లో 2010వ సంవత్సరంలో రూ. 20 లక్షలు రుణంగా తీసుకున్నారు. లోన్ నిమిత్తం ఆయన భార్య నరసమాంభ ఆస్తి పత్రాలను గ్యారెంటార్‌గా బ్యాంకులో డిపాజిట్ చేశారు. 2018లో వడ్డీతో సహా లోన్ క్లియర్ చేశారు. అయితే లోన్ మొత్తం కట్టిన కూడా ఆస్తి పత్రాలు బ్యాంకు వారు తిరిగి ఇవ్వకుండా పత్రాలు కనిపించడం లేదని సర్టిఫైడ్ కాపీలను ఇస్తామని చెప్పారు. ఒరిజనల్ పత్రాల కోసం బ్యాంకు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో సత్యనారాయణమూర్తి వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సభ్యులు విచారణ అనంతరం ఆస్తిపత్రాల సర్టిఫైడ్ కాపీలతోపాటు ఆ ఆస్తిపై ఎటువంటి బాకీ లేదని సర్టిఫికెట్, ఫిర్యాదుదారునికి డాక్యుమెంట్లు ఇవ్వాలని, ఫైనాన్షియల్ డ్యామేజ్ కింద ఆస్తి పత్రాలకు గానూ రూ. 5 లక్షలు నష్టపరిహారం, మానసిక వేదన కలిగించినందుకు రూ. 50 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు 30 రోజుల్లోగా ఇవ్వాలని తీర్పు వెల్లడించారు.